సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం | 5 | ఆగస్టు | 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం జంగారెడ్డిగూడెంకు చెందిన దొడ్డి హైమావతి రూ.1,07,500 విరాళంగా అందజేశారు.



లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిలో భాగంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

జిల్లాలు దాటి పింఛన్ల పంపిణీ

జిల్లాలు దాటి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తూ తమ సేవాగుణాన్ని చాటుతున్నారు వలంటీర్లు. వివిధ కారణాలతో సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారి వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు.



8లో ▸

న్యూస్‌రీల్

5 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని 5 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ తెలిపారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ పరిధిలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయనున్న 11 రైల్వే స్టేషన్లలో ఆయన వర్చువల్‌గా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏలూరు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్వీ రమేష్ ఆధ్వర్యంలో ఏలూరులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ భారతదేశం అంతటా ప్రయాణికులకు స్టేషన్ అనుభవాన్ని మెరుగుపరచడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయకమైన దృక్పథం అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను ఈనెల 6న ఒకే సారి ప్రారంభించనున్నట్లు వివరించారు.

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద రోజు రోజుకు తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద శుక్రవారం నాటికి 28.430 మీటర్ల వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. స్పిల్‌వే నుంచి 2,54,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది.

నిధుల దుర్వినియోగంపై విచారణ వేగవంతం

దెందులూరు: దెందులూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ చంద్రశేఖర్ ఏలూరు డివిజన్‌లోని 10 మంది ఉద్యోగులతో రికార్డుల ధ్రువీకరణ ప్రారంభించారు. ఇప్పటికే రికార్డులు స్వాధీనం చేసుకుని 23 రోజులు కావస్తున్న నేపథ్యంలో విచారణను వేగవంతం చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసిన రికార్డులు తనిఖీ చేస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా పంచాయతీ, శివారు ప్రాంతాల్లో వసూలు చేసిన పన్నుల రికార్డులు, రసీదులు, బ్యాంకుల్లో జమ, ఇతర అంశాలపై పది మంది ఉద్యోగులతో విచారణ చేస్తున్నారు. ప్రధానంగా దెందులూరు సర్పంచ్, ఆమె భర్త, గ్రామ కార్యదర్శితో పాటు మరో ఇద్దరి బ్యాంకు అకౌంట్లకు పంచాయతీ నిధులు నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. ఈ విషయం వాస్తవమని తేలడంతో తదుపరి విచారణలో భాగంగా పన్నుల నగదుపై పది మంది ఉద్యోగులతో విచారణ చేయిస్తున్నామని జిల్లా అధికారులు వివరించారు.

ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రద్దు

నరసాపురం రూరల్: నరసాపురం నుంచి వయా తిరుపతి మీదుగా వెళ్లే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఈ నెల 10 నుంచి 15 వరకూ రద్దు చేసినట్లు రైల్వే మేనేజర్ చినమిల్లి దివాకర్ తెలిపారు. ధర్మవరం నుంచి నరసాపురం వయా తిరుపతి మీదుగా వెళ్లే ధర్మవరం రైలు కూడా 11 నుంచి 16 వరకూ రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే విజయవాడ వరకూ నడుస్తున్న నరసాపురం నుంచి గుంటూరు వెళ్లే ఫాస్ట్ పాసింజర్ రైలు ఈ నెల 15 వరకూ విజయవాడ వరకు మాత్రమే నడుస్తుందని మేనేజర్ పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

ఆగిరిపల్లి(నూజివీడు): జోనల్ లెవెల్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా జట్టుకు మండలంలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్‌కు చెందిన 37 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.సాయిబాబు తెలిపారు. అండర్–13 విభాగంలో 11 మంది బాలురు, ఏడుగురు బాలికలు, అండర్–15 విభాగంలో 19 మంది బాలబాలికలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 3న ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు.

వెబ్‌సైట్‌లో డీఈఎల్‌ఈడీ హాల్‌టికెట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం(ఎస్‌సీఈఆర్‌టీ) ఉత్తర్వుల మేరకు ఈ నెల 10 నుంచి 17 వరకూ నిర్వహించనున్న 2021–23 సంవత్సరపు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) 3వ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరపు సప్లిమెంటరీ, సీఎల్‌ఐఎస్‌సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను ఈ నెల 5 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

రైల్వేస్టేషన్లకు మహర్దశ

- అమృత్ భారత్ పథకానికి 5 స్టేషన్ల ఎంపిక
- ఉమ్మడి పశ్చిమలో భీమవరం టౌన్, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు స్టేషన్లలో అభివృద్ధి పనులు
- రూ.123.16 కోట్లతో పనులకు శ్రీకారం



అమృత్ భారత్ పథకంలో ఎంపికైన భీమవరం టౌన్ రైల్వే స్టేషన్

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని రైల్వే స్టేషన్లకు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, సకల సౌకర్యాలు సమకూర్చాలనే లక్ష్యంతో రైల్వేశాఖ రాష్ట్రంలో 11 రైల్వేస్టేషన్లు ఎంపిక చేయగా వీటిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి 5 రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, భీమవరం టౌన్, నరసాపురం స్టేషన్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

రూ.123.16 కోట్లతో అభివృద్ధి

అమృత్ భారత్ పథకం ద్వారా రూ.123.16 కోట్లతో 5 రైల్వేస్టేషన్ల ఆధునికీకరిస్తారు. ఈ పథకంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపర్చడం, ప్రయాణికులకు ఆధునిక వసతులు కల్పించడం, ప్లాట్‌ఫాంపై టైల్స్, వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, నూతన టాయిలెట్స్, ఉచిత వైఫై, ప్రాధాన్యతను బట్టి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, ముఖద్వారం అభివృద్ధి, ఎలక్ట్రిక్ లైటింగ్ వర్క్స్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నెల 6న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమృత్ భారత్‌లో ఎంపికైన స్టేషన్‌ల్లో అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి డబుల్ ట్రాక్ నిర్మించడంతో రైల్వే ప్రయాణం సులభతరమైంది. ఇదే నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 5 స్టేషన్లను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయడంపై జిల్లాలోని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కేటాయింపు.. పనులు ఇలా..

పట్టణం	నిధులు (రూ. కోట్లలో)	పనులు
భీమవరం టౌన్	22.13	నూతన టాయిలెట్లు, వెయిటింగ్ హాల్ నిర్మాణం, టైల్స్ పనులు
ఏలూరు	21.10	రెండు ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్ నిర్మాణం, టైల్స్ పనులు
నరసాపురం	25.70	రెండు లిఫ్టులు, నూతన భవనం, వెయిటింగ్ హాల్ నిర్మాణం
తాడేపల్లిగూడెం	27.13	రెండు ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ముఖద్వార నిర్మాణం
నిడదవోలు	27.10	2 లిఫ్టులు, 3 ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

టీడీపీ, జనసేన డ్రామా కంపెనీలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగుదేశం, జనసేన పార్టీలు డ్రామా కంపెనీలు లాంటివని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో చెట్లు రోడ్డు, ఏరియా ఆసుపత్రి జంక్షన్ నుంచి టీటీడీ కళ్యాణ మండపం వరకు నిర్మించనున్న రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్లు పాడైపోయాయని రోడ్లెక్కుతున్న నాయకులు గత ఐదేళ్ల కాలంలో ఏం చేశారని, గాడిదలను కాశారా? అంటూ దుయ్యబట్టారు. గోతుల్లో రెండు బుట్టలు మట్టి వేసి ఫొటో దిగితే రోడ్లు బాగుపడవన్నారు. నియోజకవర్గంపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడిగా తనకు అన్ని తెలుసన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఇప్పటికే చెట్ల రోడ్డులో ఇరువైపులా రూ.1.60 కోట్లతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. తిరిగి రూ.86 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒట్టు వేసి దీపాలు ఆర్పడం కాదని, అభివృద్ధి చేసి చూపించాలంటే సమర్థత ఉండాలన్నారు. మసీదు సెంటర్ నుంచి టీటీడీ కళ్యాణమండపానికి వెళ్ళే ప్రధాన రహదారిని, మహాలక్ష్మినగర్ నాలుగో నెంబరు రోడ్డు నుంచి టీటీడీ కళ్యాణమండపం వద్ద దానమ్మ గుడి రోడ్డు వరకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మీలాగా బినామీ పేర్లతో తాను కాంట్రాక్టులు ఏనాడూ చేయలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా రూ.68 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్టు నేడు రూ.168 కోట్లకు పెరిగిందన్నారు. ఒక్క నాలుగు, ఐదు, ఆరు జోన్లలోనే రూ.112 కోట్లు వ్యయమవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. స్థానిక కనక మహాలక్ష్మి ఆలయానికి పక్కనే ఉన్న పార్కు స్థలాన్ని కొంత కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొలుకులూరి ధర్మరాజు, మున్సిపల్ ఇంజనీర్ డి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, డీఈలు జె.విజయకుమార్, కుంబియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్య పరిరక్షణ

అత్తిలి: గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఇంటివద్దకే పంపిణీ చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పేర్కొన్నారు. అత్తిలి మండలం తిరుపతిపురంలో మండల స్థాయిలో ఏర్పాటు చేసిన టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వండి, వడ్డించే విధానం అమలు ఉందని, పలు కారణాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తిని వెళ్లేవారి సంఖ్య తగ్గుతోందని గుర్తించిన ప్రభుత్వం వారి నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఇంటికే సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్యలు లేకుండా ఉండడంమే కాకుండా, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండటానికి పౌష్టికాహారం దోహదపడుతుందని చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు పామాయిల్, 5 లీటర్ల పాలు, 2 కిలోల చోడిపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, పావుకిలో ఖర్జూరం, పావుకిలో వేరుశెనగ చిక్కీలు, 25 కోడిగుడ్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ ఎంబీఎస్ ప్రమోదకుమారి, సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అత్తిలి మండలం తిరుపతిపురంలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మంత్రి కారుమూరి

సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించాలి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించి పర్యాటక అభివృద్ధికి ఇబ్బందులేకుండా చూడాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం భీమవరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నరసాపురం తీర ప్రాంతంలో నూతనంగా గుర్తించిన ఆరు బీచ్‌లను కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్లాన్‌లో చేర్చడానికి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ మాట్లాడుతూ మ్యాపులు రూపొందించే ముందు సీఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించాలని సూచించారు. సముద్ర ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరంగా ఉన్న వేముల దీవి ప్రభుత్వ భూముల్లో టూరిజం అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టుపై అభ్యంతరాలను విశదీకరించాలని సభలో అధికారులను కోరారు. టూరిజం అభివృద్ధికి గోదావరి బండ్‌పై తలపెట్టిన ప్రాజెక్టును వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరారు. సముద్ర తీర ప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన చట్టం అనుసరించి తీర ప్రాంతంలో బీచ్‌లను అభివద్ధి చేస్తున్నామన్నారు. ఆరు బీచ్‌లను జిల్లా సమావేశంలో ఆమోదించి కోస్టల్ జోనల్ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచడానికి పంపుతామన్నారు. వేముల దీవి గ్రామంలోని వేముల దేవి బీచ్, పెదమైనవానిలంక గ్రామంలోని పెదమైనవానిలంక బీచ్, కేపీ పాలెం సౌత్ గ్రామపంచాయతీలోని కేపీ పాలెం బీచ్, పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలోని పేరుపాలెం బీచ్, పేరుపాలెం సౌత్ గ్రామ పంచాయతీలోని కనకదుర్గ బీచ్, పేరుపాలెం సౌత్ గ్రామపంచాయతీలోని మోళ్లపర్రు బీచ్‌లు ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, ఉభయ గోదావరి జిల్లాల టూరిజం అధికారి ఎండీ హెచ్ మెహరాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వర రావు, టూరిజం ఈఈ ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నేటి నుంచి కొల్లేరు జోనల్ ఫుట్‌బాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: కొల్లేరు జోనల్ సబ్ జూనియర్(అండర్–13) ఫుట్‌బాల్ పోటీలను ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని డాన్‌బాస్కో స్కూల్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కొల్లేరు జోనల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలు 6న ముగుస్తాయన్నారు.

పారదర్శకంగా ఏటిగట్టు రక్షణ పనులు

నరసాపురం రూరల్: నరసాపురం గోదావరి ఏటిగట్టు రక్షణ పనుల నాణ్యతలో ఎక్కడా తేడా లేదని, పనులు రాజీ లేకుండా పారదర్శకంగా జరుగుతున్నాయని ఏటిగట్ల సంరక్షణ శాఖ ఈఈ ఆర్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఏటిగట్ల పనులను పరిశీలించి నాణ్యతా లోపాలంటూ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. శుక్రవారం ఆయన పనులు జరుగుతున్న ప్రాంతంలో విలేకర్లతో మాట్లాడారు. గత సంవత్సరం గోదావరి వరద భారీగా వచ్చిందని.. ఆ వరద తాకిడికి దెబ్బతిన్న ఏటిగట్టు నిర్మాణ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషివల్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆ పనులు 45 శాతం జరిగాయన్నారు. మిగిలిన పనులను అగ్రిమెంట్ పూర్తయ్యేలోగా పూర్తిచేస్తామన్నారు. ఏటిగట్టు రక్షణకు వినియోగించిన రాళ్లు బలమైనవని చెప్పారు. జెఎన్‌టీయూ నాణ్యత నిర్ధారణ అనంతరం వీటిని వినియోగించామన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన క్వారీ నుంచి రాళ్లు తెచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్యే పనులు పూర్తి కాకుండానే మాట్లాడారన్నారు. ఎక్కడా రాజీ లేకుండా క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణలో ఏటిగట్టు సంరక్షణ పనులు జరుగుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం తక్కువ టెండరు వేసిన వారికి కాంట్రాక్టు దక్కిందన్నారు. పని అప్పగించే విషయంలో కూడా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా చేసినట్లు చెప్పారు. పనులు ఏమేరకు పటిష్టంగా జరిగాయో ఇటీవల వచ్చిన వరద తాకిడితో స్పష్టమైందన్నారు. వరద సమయంలో ఊపిరి పీల్చుకున్నారనే విషయం కూడా ఈ ప్రాంత ప్రజలే చెబుతున్నారని అన్నారు. గతంలో కోతకు గురైన ప్రాంతంలో నుంచి ఎంతమేర లోపలకి పూడిక చేశారో వివరించారు. ఏటిగట్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనుల ఫొటోలు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లు, జెఎన్టీయూ సర్టిఫికెట్‌లను విలేకర్లకు చూపించారు.




పొన్నపల్లి వద్ద ఏటిగట్టు పనుల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ విశ్వేశ్వరరావు

ఆరోగ్య 'సిరి'ధాన్యాలు

- మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్
- మన్యంలో పెరుగుతున్న సాగు



కొర్రలు



సామలు



అరికెలు

బుట్టాయగూడెం: ప్రజల ఆహార అలవాట్లలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. వరి అన్నం బదులు బామ్మలు, తాతయ్యలు ఒకప్పుడు తిన్న తిండిని ఇప్పుడు ఇష్టపడుతున్నారు. వైద్యులు కూడా చిరుధాన్యాలు(సిరిధాన్యాలు) తినమని సూచిస్తున్నారు. దీంతో రాగులు, జొన్నలు, సామలు, అరికెలకు డిమాండ్ పెరిగింది. ఈ మార్పు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సైతం చెప్పుతున్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తింటూ ఆయురారోగ్యాలను పొందే ప్రయత్నం చేస్తున్నారు.

ఏజెన్సీలో పెరిగిన సాగు విస్తీర్ణం

వ్యాధుల నుంచి రక్షించుకోవడం కోసం ఆహారపు అలవాట్లలో మార్పులు అనివార్యంగా భావిస్తున్నారు. ఈ మేరకు కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, సామలు, అరికలు వంటి పంటలు ఇప్పుడు సిరి ధాన్యాలుగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఎలాంటి పరిస్థితుల్లోనైనా స్థిరమైన దిగుబడి ఇవ్వడంతో పాటు అధిక పోషక విలువలు కలిగిఉన్నవే చిరుధాన్యాలు. చిరుధాన్యాల వినియోగంపై అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపడంతో తాజాగా వీటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. చిరుధాన్యల సాగుతో లాభాలు మెండుగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల కొండ ప్రాంతంలో నివసించే ఆదివాసీల ప్రధాన పంటలు జొన్నలు, రాగులు, సామలు. అయితే మారుతున్న కాలంతో పాటు గిరిజనులు కూడా ఆహారపు అలవాట్లలో మార్పులు కోరుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య సమస్యల కారణంగా వారు కూడా చిరుధాన్యాల సాగువైపు మళ్లీ దృష్టి సారించారు. దీంతో ఏజెన్సీ గత కొన్నేళ్లుగా చిరు ధాన్యాలు సాగు విస్తీర్ణం పెరిగింది.

600 ఎకరాల్లో చిరుధాన్యాలు : ఈ ఏడాది ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతంలో సుమారు 600 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు పండించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 350 ఎకరాలు చిరుధాన్యాల పంటలు వేసినట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, అరెకల్లో అన్ని పోషకాలు ఉండడంతో ప్రజలు కూడా వాటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గర్భిణులకు చిరుధాన్యాల ఆహారం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు చిరుధాన్యాలనే ఆహారంగా ఇస్తున్నారు. అలాగే బాల సంజీవని కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు కూడా కొర్రలు, రాగి, జొన్నలు వంటి ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు. గిరిజన ప్రాంతంలోని సుమారు 437 అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చిరుధాన్యాల వంటలను ఆహారంగా ఇస్తున్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నాం. అన్ని పోషకాలు ఉండడంతో వారికి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తున్నాయి.

– ఈ.తులసి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, బుట్టాయగూడెం


అవగాహన కల్పిస్తున్నాం



చిరుధాన్యాల పంటలపై రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంటల ప్రాముఖ్యతపై గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పాత తరం వారు వెంటనే పంటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. చిరుధాన్యాల పంటల సాగు పెరగాలంటే కొంత సమయం పడుతుంది.

– బి.సుమలత, ఏఓ, బుట్టాయగూడెం

శ్రీవారి ఆలయంలో భారీగా అంతర్గత బదిలీలు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు శుక్రవారం భారీగా జరిగాయి. ఏళ్ల తరబడి ఉద్యోగులు ఒకేచోట పాతుకుపోవడం వల్ల పలు అక్రమాలు జరుగుతున్నట్లు దేవదాయ శాఖ అధికారులు గుర్తించారు. దాంతో ఇకపై ప్రతి మూడు నెలలకోసారి రొటేషన్ పద్ధతిలో ఉద్యోగుల విధులను తప్పనిసరిగా మార్చాలంటూ, అన్ని ఆలయాల అధికారులను దేవదాయశాఖ కమిషనర్ ఇటీవల సర్క్యులర్ ద్వారా ఆదేశించారు. ఆ ఆదేశాలను ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు అమలు పరిచారు. ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీగా అంతర్గత బదిలీలు జరిపారు. అందులో భాగంగా నలుగురు ఏఈఓలు, ఏడుగురు సూపరింటిండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది రికార్డ్ అసిస్టెంట్లు, ఏడుగురు అటెండర్లు ఇతరులకు స్థానచలనం కలిగింది. వీరితో పాటు ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల విధులను సైతం మార్చారు.

క్లుప్తంగా

వాసవీలో వర్క్‌షాపు


మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు

తాడేపల్లిగూడెం : కాంక్రీట్, స్టీల్ టెస్టింగ్ విషయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కాకినాడకు చెందిన ప్రముఖ స్ట్రక్చరల్ ఇంజినీర్, కన్సల్టెంట్ డాక్టర్ కేవీ నరసింహారావు అన్నారు. శుక్రవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు జరిగింది. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాపులు ఉపయుక్తంగా ఉంటాయని చాప్టర్ చైర్మన్ డి.హరికుమార్ అన్నారు. వైస్‌చైర్మన్ కె.రామచంద్రారెడ్డి, భాస్కర్ తీగెల, కె.ఆనంద బాబు, కళాశాల టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

శశిలో వర్క్‌షాపు


శశి వర్క్‌షాపులో పాల్గొన్న సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ

తాడేపల్లిగూడెం: సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచిలను నిర్లక్ష్యం చేయకూడదని జేఎన్‌టీయూ కాకినాడ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. శశి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జియోసింథటిక్ ఫర్ స్ట్రక్చరల్ సస్టెనబిలిటీ రెజీనియన్స్‌పై వర్క్‌షాపు ప్రారంభమైంది. ఇంజనీర్ కెనయీముల్లా మాట్లాడుతూ జియోసింథటిక్ ప్రాముఖ్యత, హైవే నిర్మాణంలో వీటి వినియోగంలో అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ సివిల్ డిపార్టుమెంటు హెడ్ ఎం.రామారావు పాల్గొన్నారు.

జిల్లాలు దాటి.. సేవాగుణం చాటి

- సుదూర ప్రాంతాల్లో ఉన్నా పింఛన్ల అందజేత
- వలంటీర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు

తమకు కేటాయించిన ఇళ్లకే పరిమితం కాకుండా జిల్లాలు దాటి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తూ తమ సేవాగుణాన్ని చాటుతున్నారు వలంటీర్లు. స్థానికంగా ప్రతి నెలా పింఛను తీసుకునే లబ్ధిదారులు.. వివిధ కారణాలతో సుదూర ప్రాంతాల్లో ఉంటున్నా వారి వివరాలు తెలుసుకుని మరీ వలంటీర్లు అక్కడకే వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులకు సకాలంలో పింఛను సొమ్ము అందిస్తూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తూ వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నింపుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా సేవలందిస్తుండటంతో వారిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు తమ పరిధిలోని వృద్ధులకు దూరప్రాంతాలకు వెళ్లి పింఛను అందజేశారు. సచివాలయం-2 వలంటీర్ గుణ్ణం సునీత తన క్లస్టర్‌లోని వృద్ధురాలు చిప్పాడ రమణమ్మ వృద్ధాప్య పింఛను పొందుతోంది. అయితే నోటి క్యాన్సర్ కారణంగా ఏలూరు వద్ద గల వంగాయగూడెంలోని ఆసుపత్రిలో చికిత్స కోసం చేరింది. విషయం తెలుసుకున్న సునీత వంగాయగూడెం వెళ్లి రమణమ్మకు పింఛను అందజేసింది. అలాగే గ్రామానికి చెందిన మరో వలంటీర్ గల్లి అంబేద్కర్ తన క్లస్టర్‌లోని ఏలూరి ఈశ్వరమ్మ అనే వృద్ధురాలికి చేయి విరిగి రాజమండ్రిలోని తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతోంది. అంబేద్కర్ రాజమండ్రి వెళ్లి ఈశ్వరమ్మకు పింఛను అందజేశారు.


తణుకు టౌన్: ఏలూరు వెళ్లి పింఛను అందజేస్తున్న వేల్పూరు వలంటీర్ గుణ్ణం సునీత


పాలకొల్లు సెంట్రల్: కాకినాడ వెళ్లి ఫింఛన్ అందిస్తున్న వలంటీర్ జ్యోతి, వాసవి


తణుకు టౌన్: రాజమండ్రి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్ గల్లి అంబేద్కర్


యలమంచిలి: హైదరాబాద్ వెళ్లి పింఛన్ ఇస్తున్న చించినాడ వలంటీర్ జిల్లెళ్ల సంతోష్‌బాబు


కాళ్ల : గుడివాడలో భాగ్యమ్మకు వితంతు పింఛను ఇస్తున్న వలంటీర్ గణేష్


తాడేపల్లిగూడెం అర్బన్: గన్నవరం వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్ మణి


తాడేపల్లిగూడెం అర్బన్: ఏలూరు వెళ్లి పింఛను సొమ్ము ఇస్తున్న వలంటీర్ వంక రేవతి

కాకినాడ వెళ్లి..

పాలకొల్లు సెంట్రల్ : పట్టణంలోని ఏడో నంబర్ సచివాలయం పరిధిలోని 17వ వార్డుకు చెందిన భీమనాథ వెంకటలక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ తోట జ్యోతి గురువారం కాకినాడ వెళ్లి ఆ వృద్ధురాలికి పింఛను అందించింది. దూరప్రయాణం కావడంతో మరో వలంటీర్ మిత్రురాలు గజ్జరపు వాసవిని తోడుగా తీసుకువెళ్లి ఫింఛన్ అందజేసింది.

గన్నవరం వెళ్లి..

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం 19వ వార్డు భాగ్యలక్ష్మీపేటకు చెందిన అల్లు దుర్గారావు తన కుమార్తెకు కిడ్నీని దానం చేశారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు గన్నవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భాగలక్ష్మీపేట వలంటీరు గన్నవరం వెళ్లి అల్లు దుర్గారావుకు పింఛను అందచేశారు. అలాగే పట్టణానికి చెందిన షేక్ సైదులు ప్రమాదవశాత్తు గాయపడటంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఆ వార్డు వలంటీరు వంక రేవతి ఏలూరు వెళ్లి సైదులుకు పింఛను సొమ్ము అందజేశారు.

హైదరాబాద్ వెళ్లి..

యలమంచిలి : చించినాడకు చెందిన గంటా విజయావతి అనే వృద్ధురాలు అనారోగ్యరీత్యా వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో చించినాడ వలంటీర్ జిల్లెళ్ల సంతోష్‌బాబు హైదరాబాద్ వెళ్లి ఆమెకు శుక్రవారం పింఛన్ అందజేశారు.

గుడివాడ వెళ్లి..

కాళ్ల : సీసలికి చెందిన వితంతురాలు జి.భాగ్యమ్మ గుడివాడలో బంధువుల ఇంటికి వెళ్లారు. వలంటీర్ గణేశ్న గణేష్ శుక్రవారం గుడివాడ వెళ్లి ఆమెకు ఆగస్టు నెల పెన్షన్ సొమ్మును ఆమెకు అందజేశారు.

'డీఎన్నార్'కు నాక్ ఎ++ గుర్తింపు

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఏ++ గ్రేడ్ కేటాయించిందని కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహారాజు చెప్పారు. కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాక్ గ్రేడ్ సాధించడానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమష్టి కృషి ఫలితమేనన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలతోపాటు ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ వంటివి పూర్తిస్థాయిలో కల్పించామన్నారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, శిక్షణ, ప్లేస్‌మెంట్స్‌లో రాజీపడకుండా విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు సుమారు రెండు వేల మంది విద్యార్థులు అనేక రంగాలలో శిక్షణ పొందారన్నారు. ప్రిన్సిపాల్ ఎం.అంజన్ కుమార్ మాట్లాడుతూ ఏపీఎస్‌సీహెచ్ఈ ద్వారా లీడర్స్‌గా గుర్తింపు, స్మార్ట్ ఇండియన్ హాకథాన్ 2019లో సౌత్ ఇండియా రన్నర్స్‌గా నిలవడం వంటి అనేక విజయాలను తమ కళాశాల సొంతంచేసుకుందన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, వైస్ ప్రిన్సిపాల్ బీవీఎస్ వర్మ పాల్గొన్నారు.

నారాయణపురంలో వ్యక్తి హత్య


నారాయణపురంలో చంద్రశేఖర్ మృతదేహం

ఉంగుటూరు: నారాయణపురంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన కూరపాటి చంద్రశేఖర్ (39), భార్య భువనేశ్వరి, పిల్లలు తొమ్మిదేళ్ల వయస్సున్న నిత్యశ్రీ, ఐదేళ్ల వయస్సున్న సిద్ధార్థతో కలిసి నారాయణపురంలో ఉంటూ స్థానికంగా ఉన్న ఓ సిరామిక్ పరిశ్రమలో సూపర్‌వైజరుగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం షిఫ్ట్‌లో పనిచేసి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి చేరుకుని రాత్రి వరకు ఇంట్లోనే ఉన్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత చంద్రశేఖర్ హత్యకు గురయ్యాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చంద్రశేఖర్ పీకపై కత్తిగాట్లను గుర్తించి హత్యగా నిర్ధారించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వెళ్లారు. పోలీసు జాగిలాలను రంగంలోకి దింపారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్సై స్వామి కేసు నమోదు చేయగా,, గణపవరం సీఐ సుబాష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తన భర్తను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపేసి, తన వద్ద ఉన్న బంగారాన్ని పట్టుకెళ్లిపోయారని భార్య భువనేశ్వరి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే చంద్రశేఖర్ హత్యకు గురై ఉండవచ్చని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. దీనిపై విచారణ చేస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం


అత్తిలి : తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఓ కుటుంబానికి బ్రోచర్‌ను అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


నరసాపురం రూరల్ : నరసాపురం 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న నరసాపురం ఎమ్మెల్యే, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

చంద్రబాబుకు సింగిల్ డిజిట్ ఖాయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


జగన్నాథపురంలో మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పుంగనూరులో చంద్రబాబు సృష్టించిన విధ్వంసాన్ని ప్రభుత్వానికి ఆపాదించే ప్రయత్నం పచ్చమీడియా చేయనుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి జగన్నాథపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు సందర్శనలో భాగంగా పుంగనూరులో చంద్రబాబు మీటింగ్‌కు పట్టుమని పది మంది జనం కూడా రాలేదన్నారు. చంద్రబాబు వెనకాల వెళ్లిన వారు ఒక తుపాకీ, 18 తూటాలు, కర్రలతో దొరికారన్నారు. అక్కడకు వెళ్లిన వారిపై రాళ్లు రువ్వడంతో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్ల బస్సును తగలబెట్టారన్నారు. తన మీటింగ్‌లకు జనం రాకపోవడంతో చంద్రబాబు అసహనానికి గురవుతున్నాడన్నారు. ఇటువంటి విధ్వంసాలకు పాల్పడితే చంద్రబాబును ఎవరు గుర్తిస్తారన్నారు. తన పాలనలో దోచేసిన సొమ్మును ఎవరికి పెట్టాడో వారే ఆయన వెంట ఉన్నారన్నారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రూ.2.76 లక్షల కోట్ల అప్పు చేస్తే జగన్ నాలుగేళ్ల మూడు నెలల్లో రూ.1.77 లక్షల కోట్లు అప్పు చేసినట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారన్నారు. అయితే చంద్రబాబు తన పాలనలో తీసుకున్న అప్పు ఏం చేశారని నిలదీశారు. జగన్ తీసుకున్న అప్పులో రూ.1.77 లక్షల కోట్లను 1.60 కోట్ల కుటుంబాలకు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా వారి ఖాతాలకు జమ చేశారన్నారు. అలాగే, అభివృద్ధి రూపంలో కనిపిస్తోందన్నారు. జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారన్నారు. దీనిని చూసి చంద్రబాబు, పచ్చమీడియా తట్టుకోలేకపోతోందన్నారు. ప్రతిపక్ష నాయకుడిపై ప్రజలు నిరసన తెలియజేస్తుండటంతో రాబోయే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కు పడిపోతామనే భయంలో చంద్రబాబు పిచ్చెక్కి మాట్లాడుతున్నాడని విమర్శించారు.

క్లుప్తంగా

నులిపురుగుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పెంటపాడు మండల కార్యాలయంలో సమావేశమైన మండల అధికారులు, ప్రభుత్వ డాక్టర్లు

పెంటపాడు: ఈనెల 10న మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించబోయే నులిపురుగుల దినోత్సవాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు మండల కార్యాలయంలో మాట్లాడుతూ 2 నుంచి 19 లోపు పిల్లలైన పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలోని 5172 మంది, ముదునూరు పీహెచ్ పరిధిలోని 7168 మందికి ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ విషయంపై మాత్రల పంపిణీ సక్రమంగా జరిగేలా సంబంధిత నిర్వాహకులు చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు ఎస్వీ రమణ, తోట రాజేష్, లావణ్య, ప్రియాంకలతో పాటు, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

గూడెం క్రైస్తవుల కోసం సమాధి ప్రాంతం కేటాయించాలి



గూడెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న క్రైస్తవ జేఏసీ నాయకులు

పెంటపాడు: గూడెం పట్టణంలో క్రైస్తవుల కోసం సమాదుల ప్రాంతాన్ని కేటాయించాలని గూడెం క్రైస్తవ సంఘ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గూడెం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్‌కు అందజేశారు. పట్టణంలోని పలు డినామినేషన్‌లకు చెందిన క్రైస్తవసంఘాలు నాయకులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. స్థానిక పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించారు. శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి మునగాల జితేంద్ర, కుందుం వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి సత్యనారాయణ, సాయి శృతి,యర్రా ఆంజనేయస్వామి, సంపత్, అంబికా, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో మమేకం కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం అర్బన్ : హిందూ ధర్మ పరిరక్షణలో అందరూ మమేకం కావాలని సద్గురు హరిత దాసాజీ పిలుపునిచ్చారు. స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ధాన్య యోగా మందిరంలో హిందూ ధర్మంపై ప్రవచన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిత దాసాజీ మాట్లాడుతూ ఏమి జరిగినా మన మంచికే అని భావించాలన్నారు. దానిని పరమాత్మునికి తెలియజేయాలని అదే హిందూ ధర్మం భావమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధం రాంబాబు, పంపాని త్రినాథ్, పచ్చిగోళ్ళ రామచంద్రరావు, చిట్యాల విద్యావతి, కోట్ల హైమావతి, కోన వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ నిరసన

తాడేపల్లిగూడెం అర్బన్ : ఈనెల 5వతేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు ఎల్ రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు 35వేల మందికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ప్రభుత్వం వైఫల్యమని అన్నారు. శనివారం నిరసన వెల్లడిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం నాగరాట్నాలు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగన్నాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఇదేం కర్మ పేరిట చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహించి, 12 మందిని బలిగొన్నాడని, నారా చంద్రబాబు అనడం కంటే నారాసురుడు అంటే సముచితంగా ఉంటుందని కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. నేడు ప్రాజెక్టు పరిశీలన పేరుతో పుంగనూరులో విధ్వంసాన్ని సృష్టించాడని ఆరోపించారు. జగన్నాథపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. గ్రామంలోని ఒక కుటుంబాన్ని పరిశీలిస్తే వారి పిల్లలకు కాలేజీ ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన పేరిట రూ.4.50లక్షలు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వ్యవసాయ పరంగాను లక్షలాది రూపాయలు అందించడం జరిగిందన్నారు. జగన్ చేసిన అప్పు అభివృద్ధి, సంక్షేమం రూపంలో ప్రత్యక్షంగా కనిపిస్తోందన్నారు. ఈ అభివృద్ధి చంద్రబాబుకు కనిపించడం లేదన్నారు. కాగా, ఇంటి స్థలం కావాలని కోరిన వారికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పలువురికి కొత్తగా మంజూరైన రైస్ కార్డులను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్‌ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌సంపతరావు కృష్ణారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఈవో కె.శ్రీనివాసరెడ్డి, సచివాలయం-2 కార్యదర్శి ఫణింద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, ముప్పిడి సంపత్‌కుమార్, చిట్బూరి బాపన్న, అడ్డాల గోపీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



పెంటపాడు సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో సుజాత, ఎంపీపీ హైమావతి తదితరులు

పెంటపాడు: తల్లిపాలు బిడ్డకు రోగనిరోధక శక్తినిస్తాయని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని పెంటపాడు పంచాయతీ సమావేశమందిరంలో ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కోసం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో డి. సుజాత తల్లులకు చిన్నారుల పోషణ, తల్లిపాల ఆవశ్యకత, శిశువుల ఆరోగ్యం తదితర విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను ప్రతీ బాలింత గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, గ్రంథాలయ అధ్యక్షుడు కర్రి వరహాలరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, వార్డు సభ్యులు వెలగల శ్రీనివాసరెడ్డి(బస్సుల రెడ్డి), బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీను, కర్రి లక్ష్మి ప్రియాంక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దుర్గా భవాని, కె.సుజాత, జీజీబీ జయలక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొలుపూరి శివ కిరణ్, బండారు రాంబాబు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, అనూరాధ, కనక లక్ష్మి రోజా విమల తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో :
తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని రామచంద్రపురం గ్రామంలో పార్టీ నాయకులు చల్లా లింగమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామిలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిట్‌లు పంపిణీ చేశారు. తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు బాలింతలకు వివరించారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలోని విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మర్రి అజయ్, వి సాయి,నేకూరి బాబులు, వర్ల రాజేష్, దిర్సుపాటి పవన్‌కుమార్, అడపా ఉత్తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై ఆందోళన



అత్తిలిలో..కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నసినెడ్ సియోను లూథరన్ సంఘ సభ్యులు



పెంటపాడులో... మాట్లాడుతున్న రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్

అత్తిలి: మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న హింసాత్మక సంఘటనలు ఖండిస్తూ, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలకు నిరసనగా పశ్చిమ గోదావరి జిల్లా సినెడ్ సియోను లూథరన్ సంఘం ఆధ్వర్యంలో గుమ్మంపాడు గ్రామంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాస్టర్ అబ్రహాంశారా, పేరిష్ డెలిగేట్స్ టీఎఫ్ నతానియేలు, కటికతల నతానియేలు, యాళ్ల సుందరసింగ్, కటికతల నాగేశ్వరరావు, రాపాక సుగుణరావు, బుర్రా మోహన్‌రావు, పులిదిండి అశోక్, కలిగిపూడి డేవిడ్, గోనమండ రాజారత్నం, స్త్రీసమాజం సభ్యులు, సండే స్కూల్ యువత, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు గూడెంలో యుపీఏ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ
పెంటపాడు: యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మణిపూర్ సంఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారం గూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు, యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు జీజే జ్యోతి ఆనంద్ తెలిపారు. గూడెం ఫెయిత్ చర్చిలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం సెయింట్ జోన్స్ స్కూల్, కృపాచర్చి నుంచి గూడెం హౌసింగ్‌బోర్డు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆనంద్ తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, చర్చిసంఘ సభ్యులు, విశ్వాసులు, పాస్టర్లు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుపీఏ నాయకులు డీఆర్‌కే మోజెస్. ఫాదర్ బి. ఆనంద్‌బాబు, జె. సామ్యేల్‌రాజు, టి. ఇశ్రాయేలు, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి
తణుకు: మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ హెచ్చరించారు.శుక్రవారం రాత్రి స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మణిపూర్, హర్యానాలో జరుగుతున్న మత ఘర్షణలు నిరసిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మణిపూర్‌లో కూకీ తెగ ప్రజలపై సభ్యసమాజం తల దించుకునేలా దాడులు చేస్తున్నప్పటికీ ప్రధాని మోదీ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ దేశ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రధాని బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, జిల్లా నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్, గోవిందరాజు, బ్రహ్మాజీ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాల పండుగ

- పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



అత్తిలి మండలం తిరుపతిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: గడపగడపకూ సంక్షేమ పథకాలు అందిస్తుండంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో 110వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టిన పేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రతీ గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ఏఏ పథకాలు అందాయి, ఇంకా అందాల్సిన పథకాలు ఏమైనా ఉన్నాయా అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. మీకు ఏకష్టం వచ్చినా నేను అండగా ఉంటానని, నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నానన్నారు.పథకాలు అందనివారు ఉంటే వారి వివరాలు సేకరించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు మంత్రి సూచించారు. వలంటీర్లు ప్రతీ గడపకు వస్తున్నారా మీ యోగ క్షేమాలు తెలుసుకుని సేవలందిస్తున్నారా అని ప్రజలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, గ్రామపార్టీ గౌరవ అధ్యక్షులు వడ్డి రామచంద్రరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పంపన బుజ్జి, సచివాలయ కన్వీనర్ కాపవరపు లక్ష్మీ శ్రీనివాస్, బూత్ కన్వీనర్ గవర నాగన్న, ఉపసర్పంచ్ అరిటాకుల నాగశ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు నిల్లా బాలవీరయ్య, వాసా రుద్రయ్య, శలారామలింగేశ్వరరావు, తాళ్ల బసవమల్లయ్య, కంకిపాటి రత్నరాజు, కొడమంచిలి దొరబాబు, రంభ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం
అత్తిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం వచ్చిందని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలా కాకుండా ఆడపడుచులు గడప దాటకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా గడపవద్దకే వెళ్లి అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ కాండూరి లీలామణికంఠ, ఉపసర్పంచ్ అరిటాకుల నాగ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపన బుజ్జి, వడ్డి రామచంద్రరావు, గవర నాగన్న, తోలేటి కొండ, కాపవరపు శ్రీనివాస్, కంకిపాటి రత్నరాజు, కొడమంచిలి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతి అందజేత



తణుకులో క్రీడాకారులకు నగదు బహుమతి అందిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: జాతీయస్థాయిలో బ్యాడ్మింటన్ జూనియర్ విభాగంలో రాణిస్తున్న క్రీడాకారులకు యువనేత కారుమూరి సునీల్‌కుమార్ శుక్రవారం రూ. 50వేలు నగదు బహుమతి అందజేశారు. తణుకు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులైన కవలలు ఆకుల త్రిలోక్, ఆకుల త్రిలోచన్‌లు లక్నోలో నిర్వహించిన బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో జాతీయ స్థాయిలో రాణించిన సందర్భంగా కారుమూరి సేవా సమితి ద్వారా ఈ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అత్యుత్తమ స్థాయిలో రాణించే క్రీడాకారులకు జగనన్న ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, కర్రి కాశీరెడ్డి, మురాల సుధాకర్, చేిట్టి లలితా శంకర్, తాటిపర్తి వాసు, రేలంగి రాంబాబు, గంజి సతీష్ పాల్గొన్నారు.

ఉజ్జీవ ప్రార్ధనలు ప్రారంభం

పెంటపాడు: ఉపవాసం ద్వారా దేవుని ఆధాత్మిక శక్తి పొందవచ్చని పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. గూడెం మండలం పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించబోయే ఉపవాస ఉజ్జీవ ప్రార్ధనా పండుగలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కె. ఘనరాజు, కె. జాజిరాజు తదితరులు దేవుని ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. శనివారం రాత్రితో ఈ సమావేశాలు ముగుస్తాయని జాజిరాజు తెలిపారు.

గూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.27.13 కోట్లు

తాడేపల్లిగూడెం: గూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం 27.13 కోట్ల రూపాయలను కేటాయించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ అన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో విషయాలను వెల్లడించారు. ప్రముఖ వాణిజ్యకేంద్రంగా ఉన్న గూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను కేంద్రం గుర్తించిందన్నారు. అమృత్ భారత్ పథకంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి 500 కోట్లకు పైగా నిధులను కేటాయించిందన్నారు. గూడెం స్టేషన్ నుంచి ఏడెనిమిది జిల్లాలకు చెందిన వారు ప్రయాణం చేస్తారని, ఈ మేరకు చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి కేంద్రం స్థానిక బీజేపీ నాయకత్వాన్ని కోరిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముప్పిడి సురేష్‌రెడ్డి, కోట రాంబాబు, ఐనం బాలకృష్ణ, నరిసే సోమేశ్వరరావు, చిట్యాల రాంబాబు, రాఘవులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు.. ఇంటి పట్టాల పంపిణీ



వెంకట్రామన్నగూడెం సచివాలయంలో ఇంటి స్థలం పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ నాగ అంజూష

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన 10 రైస్ కార్డులు, 13 ఇంటి స్థల పట్టాలను లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ పోలిమోను నాగ అంజూష అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో వారికి లబ్ధిచేకూర్చడం జరుగుతుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకుడు పోలిమోను శ్రీనివాస్, గ్రామ పెద్ద బుంగా నాగేశ్వరరావు, వార్డు మెంబర్లు ములకాల చినశ్రీను, కార్యదర్శి వి.వాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు దళితుల ఆత్మీయ సమ్మేళనం

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో దళితుల ఆత్మీయ సమ్మేళనం, తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాలు ఈనెల 6వ తేదీన తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తణుకు నియోజకవర్గ ఎస్సీ కమిటీ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దాడిశెట్టి రాజా, హోం మినిస్టర్ తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, పి.గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యప్రసాద్ హాజరవుతారన్నారు.

దళిత సమ్మేళనం విజయవంతం చేయాలి
ఇరగవరం: తణుకులో ఆదివారం బాయ్స్ హై స్కూల్‌లో జరిగే దళిత ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఇరగవరం మండల కన్వీనర్ , మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్ వి జాకబ్, గోగి బాబీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం దళితులుకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమలు వివరించడం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ తాతపూడి బోస్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పెంటపాడులో పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ హైమావతి



34వ వార్డు ఇన్‌ఛార్జి వట్టి బుజ్జి బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: పోషకాహారం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. గర్భిణులకు, బాలింతలకు 10 రకాలతో కూడిన నాణ్యమైన పౌష్టి కాహారంతో కూడిన టేక్‌హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ పెంటపాడులో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆమె మట్లాడారు. ఆరోగ్యమైన భావితరాల కోసం ఖర్చుకు వెనుకాడకుండా పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు ద్వారా పలువురికి కిట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సుజాత, జయలక్ష్మి, భవాని, అంగన్‌వాడీ వర్కర్లు శ్యామల, అరుణకుమారి, ప్రసన్న, గౌరీతో పాటు, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సూరిబాబు, నాగమణి, బండారు రాంబాబు, కె. శివకిరణ్, కర్రి లక్ష్మిప్రియాంక, వరహాల రెడ్డి, బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీను, పెంటపాడు ఆరోగ్యసిబ్బందితో పాటు, బస్సులరెడ్డి, కిషోర్, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి, బిడ్డలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి
తాడేపల్లిగూడెం అర్బన్ : తల్లి , బిడ్డలు జగనన్న ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని పట్టణంలోని ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌ఛార్జీలు తెలిపారు. 34వవార్డు ఇన్‌ఛార్జి వట్టి బుజ్జి చేతుల మీదుగా వార్డులోని తల్లి, బిడ్డలకు పౌష్టికాహర కిట్లను శుక్రవారం అందజేశారు. అదే విధంగా 14వవార్డు ఇన్‌ఛార్జి బొడ్డు సాయిబాబా బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
తాడేపల్లిగూడెం రూరల్: గర్భవతులు, బాలంతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వెంకట్రామన్నగూడెం సర్పంచ్ పోలిమోను నాగ అంజూష అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగ అంజూష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకుని ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలిమోను శ్రీనివాస్, ములకాల చినశ్రీను, సిర్రా వెంకటేశ్వరరావు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.